క్లుప్తంగా

భవానీపురంలో రామ్‌రాజ్ షోరూమ్ ప్రారంభం



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ భవానీపురం స్వాతీ రోడ్‌లో రామ్‌రాజ్ కాటన్ కంపెనీ తమ నూతన షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించింది. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానము కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధర రావు, పాపులర్ షూమార్ట్ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయకుమార్ కలిసి ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ సంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన రామ్‌రాజ్ ధోతీలు, చొక్కాలు అత్యంత ఆకర్షణీయ బ్రాండ్ జాబితాలో స్థానం పొందిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయుల కోసం ఆన్‌లైన్‌లో విక్రయాలను ప్రారంభించామని, శ్రీలంక, సింగపూర్, మలేషియా వంటి ఇతర దేశాలకు తమ ఉత్పత్తులను ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. బ్యాక్టీరియల్, వైరల్ ఇన్ఫెక్షన్ల నుండి మనల్ని రక్షించడానికి రామ్‌రాజ్ కొత్తగా యాంటీ-బ్యాక్టీరియల్ ధోతీలను ప్రవేశపెట్టిందన్నారు.

పేదల పక్షపాతి జగన్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ప్రముఖ టీవీ యాంకర్ శ్యామల అన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్ ఆధ్వర్యంలో డివిజన్ కొండ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు, యాంకర్ శ్యామల కేశినేని శ్వేతతో కలిసి ఆదివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం 53వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు ఆధ్వర్యంలో కేశినేని శ్వేత ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడపకు వెళ్ళి ప్రతీ ఒక్కరిని పలకరిస్తూ, నవరత్నాలు ప్లస్ మేనిఫెస్టోను శ్యామల, మరుపిళ్ళ రాజేష్‌తో కలిసి ప్రజలకు వివరించారు అనంతరం కేశినేని శ్వేత శ్యామలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రతి పేదవాడి ఇంట్లో అమ్మఒడి, చేయూత, పింఛను వంటి పథకాలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. రాష్ట్రంలో రెండు సంవత్సరాలు కోవిడ్ ఉన్నా కానీ ఏడు శాతానికి పేదరికాన్ని తగ్గించిన నాయకుడు జగన్ అన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం నాడు నేడు ద్వారా 45 వేల పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. ప్రతి పేద కుటుంబంలో పిల్లలందరు ఇంగ్లీష్ మీడియంలో చదువుకుంటున్నారని చెప్పారు. కేశినేని నాని విజయవాడ ప్రజలకు ఒక పెద్ద కొడుకు లాంటి వాడన్నారు. విజయవాడలో అసాధ్యం కాని పనులను చేసి చూపించిన వ్యక్తి కేశినేని నాని అని తెలిపారు. విజయవాడ నగరాన్ని జగన్ మోహన్‌రెడ్డి ట్రేడ్ అండ్ బిజినెస్ సెంటర్‌గా మార్చబోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా స్వరలయ ప్రథమ వార్షికోత్సవం



విజయాదకల్చరల్: స్వరలయ సాంస్కృతిక సేవా సంస్థ ప్రథమ వార్షికోత్సవాన్ని బందరురోడ్డులోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహిత్యపీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక సంస్థలు ప్రజాసేవలో భాగస్వాములు కావాలని సూచించారు. సంస్థ కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ విలువలతో కూడిన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పించి వారిని సత్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా నాట్యాచార్యుడు సీహెచ్ అజయ్‌కుమార్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు నేత్ర పర్వంగా సాగాయి.

మధురంగా గీతాలు..

కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సంప్రదాయ వస్త్రధారణ ఆకట్టుకుంది. స్వరలయ బృంద గాయకులు క్లాసికల్ గీతాలను మధురంగా ఆలపించారు. ఉదయం జరిగిన చిత్రలేఖనం పోటీ విజేతలకు, సినీ సంగీత కార్యక్రమంలో పాల్గొన్న గాయకులకు, నృత్య కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు, వరల్డ్ రికార్డ్ విజేత గాయని బుర్రేదం పద్మశ్రీకి హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ చేతులమీదగా బహుమతులు అందజేశారు. సంస్థ సభ్యులు మోహన్ రాంప్రసాద్, రమణమూర్తి, ప్రవీణ్‌కుమార్, నాగలక్ష్మి, మిస్ విజయవాడ(2015) శ్రీసత్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా జగనన్న

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్



పార్కులో కార్పొరేటర్లు అప్పాజీరావు, ఛటర్జీలతోపాటు వాకర్స్‌తో మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):పాతబస్తీలోని గాంధీపార్క్, ప్రధాన రహదారుల్లోని టీస్టాల్స్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ ఆదివారం సందడి చేశారు. సెలవు కావటంతో సేద తీరేందుకు, వాకింగ్ చేసేందుకు సందర్శకులు పార్కుకు తరలివచ్చారు. ఈ క్రమంలో షేక్ ఆసిఫ్ అక్కడకు చేరుకోవటంతో గాంధీ పార్క్ వాకర్స్ అసోసియేషన్ ఆయనకు సాదరంగా ఆహ్వానం పలికింది. అనంతరం అందరితో ముచ్చటించారు. కొద్దిసేపు పాదచారులతో కలిసి పార్కులో కలియ తిరిగారు. కొద్దిసేపు షటిల్ ఆడుతూ తోటి వారిని ఉత్సాహపరిచారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు జాగింగ్‌కు వచ్చిన సందర్శకులతో ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గాంధీపార్క్‌ను అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. ఎన్నో వసతులు సమకూరాయని వివరించారు. అక్కడి నుంచి పాతబస్తీలోని ప్రధానమైన మొయిన్‌బజార్‌కు చేరుకొని అక్కడ టీస్టాల్స్ వద్ద ప్రతి రోజూ ఉదయమే సమావేశమే మిత్ర బృందాలను కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. కొద్దిమంది మిత్రులతో కలిసి టీ తాగుతూ



టీ స్టాల్ వద్ద మిత్రులతో ఆసిఫ్

సందడి చేశారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని కోరారు. అక్కడి నుంచి ఐరన్ సెంటర్ వద్ద ఉన్న ముఠా కార్మికులను కలుసుకున్నారు. వారందరికీ జగన్ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమం కొనసాగాలంటే జగన్‌కు ఓటు వేయాలన్నారు. అనంతరం పాతబస్తీలోని ప్రధాన వీధుల్లో ముందుకు సాగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు మహాదేవు అప్పాజీరావు, మండేపూడి ఛటర్జీ ఏపీ జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్‌కొఠారి, పార్క్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు అన్వర్, పోతిన శ్రీనివాసరావు, భాష, సుభానీ, చోటు, అజ్మిల్‌ఖాన్, ఎండీ ఇర్ఫాన్, భాస్కరరావు, ఖాయమ్ ప్రసాదం బాలు, గౌరి, తదితరులు పాల్గొన్నారు.

కులమతాలకు అతీతంగా పరిపాలన



మాట్లాడుతున్న ఆసిఫ్



మాట్లాడుతున్న కేశినేని శ్వేత తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా పరిపాలన చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పాతబస్తీలోని పురాతన సెయింట్ పాల్స్ సెంటనరీ చర్చిని ఆదివారం ఆయన సందర్శించారు. ప్రార్థనల్లో ఆసిఫ్ పాల్గొన్నారు. అనంతరం చర్చి బయట ఆయన ఓటర్లతో మాట్లాడారు. దేశంలో అట్టడుగు వర్గాలకు అండగా ఉంటూ వారి ఉన్నతికి పాటుపడుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బహుజనులతో పాటుగా సమాజంలో అట్టడుగున ఉన్న సమాజానికి అండగా ఉంటూ వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేశారని చెప్పారు. విద్యా, వైద్య రంగాలను ఉన్నతంగా తీర్చిదిద్ది పేదల అభ్యున్నతికి విశేష కృషి చేశారని తెలిపారు. సమాజంలోని పెత్తందారులు తరుపున పనిచేస్తున్న చంద్రబాబు పేదలపై దారుణమైన దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో ఇచ్చిన ఏ వాగ్దానాన్ని అమలు చేయకుండా మోసం చేసిన చంద్రబాబు నేడు మళ్లీ సూపర్ సిక్స్ అంటూ మరోసారి అడ్డగోలుగా మాయ చేయటానికి ముందుకు వచ్చారని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని తన నిజాయితీని నిరూపించుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో రుద్రపాటి కుమార్, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్ట్ చర్చిలో.....

పాతబస్తీలోని రాయల్ హోటల్ వద్ద ఉన్న తెలుగు బాప్టిస్ట్ సెంటనరీ చర్చి ఆవరణలో జరిగిన ప్రార్థనల్లో ఎంపీ కేశినేని నాని కుమార్తె కేశినేని శ్వేత, యాంకర్ శ్యామలతో కలిసి పాల్గొన్నారు. అక్కడ చర్చి ప్రముఖులను కలిసి ఓటర్లతో ముచ్చటించారు. పదేళ్లగా ఎంపీగా పని చేస్తున్న తన తండ్రి కేశినేని నాని పార్లమెంట్ నియోజకవర్గ అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేశారన్నారు. ఏ ఒక్క మచ్చ లేకుండా నిజాయితీతో ఆయన పని చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నరహరిశెట్టి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



మైలవరం: క్రీస్తు మార్గం అనుసరణీయమని విజయవాడ కథోలిక పీఠాధిపతి తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. మైలవరం శాంతి నగర్‌లోని ఆర్‌సీఎం చర్చి విచారణ ప్రాంగణంలో నిర్వహిస్తున్న క్రైస్తవ సహాయ మాత దేవాలయం స్వర్ణోత్సవాలు మూడో రోజు ఆదివారం ముగింపు కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఆయన పాల్గొని ప్రసంగించారు. 1974లో అప్పటి విచారణ గురువుగా దివంగత బిషప్ మాథ్యూ చెరియన్ కున్నెల్ అడవిగా ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి మొదటిగా కొండపల్లి, అనంతరం చంద్రగూడెం, మైలవరం విచారణగా ఏర్పాటు చేసి ఈ దేవాలయాన్ని నిర్మించారని చెప్పారు. క్రైస్తవుల సహాయమాత విచారణ పేరుతో నేటికీ కొనసాగుతుందన్నారు. విశ్వాసంతో చేసిన ప్రార్థనల వల్ల ఎన్నో మేలులు జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా దేవాలయ నిర్మాణానికి సహకరించిన వారిని గుర్తు చేసుకున్నారు. ఇక్కడ పనిచేసిన మత గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా విచారణ గురువు కె. అనిల్ ఫ్రాన్సిస్ 150 మంది బాలబాలికలకు తొలిసారిగా దివ్య సత్ప్రసాదం అందించారు. అనంతరం ప్రేమ విందు నిర్వహించారు.

దళితుల సంక్షేమానికి జగన్ కృషి



మాట్లాడుతున్న జూపూడి ప్రభాకరరావు



హాజరైన ప్రజానీకం

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జగన్ పరిపాలనతో పెత్తందారులు భయపడి అనేక కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు అన్నారు. సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్న జగన్ గెలవకూడదని పెద్ద ఎత్తున ప్రభుత్వంపైనా దాడి చేస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ దళితుల ఆత్మీయ సమావేశం ఆదివారం సాయంత్రం వన్‌టౌన్‌లోని మాడపాటి క్లబ్ ఆవరణలో నిర్వహించారు. పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన జూపూడి ప్రభాకరరావు మాట్లాడారు. దళితుల సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రం శ్రీలంక అవుతుందని విమర్శలు చేసిన నేతలు నేడు అవే పథకాలను పెడుతున్నారన్నారు. పేదల భవితను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టే ప్రతి పని అభివృద్ధే అని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విజయవాడ ఎంపీగా కేశినేని నానిని, పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

అణగారిన వర్గాలకు అండగా జగనన్న...

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు జగనన్న ప్రభుత్వం అడుగడుగున అండగా నిలిచిందన్నారు. విద్యా వైద్య రంగాల్లో తమ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు దేశంలో మిగిలిన రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేసి అక్కున చేర్చుకుంటున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మాత్రమేనని చెప్పారు. జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవటానికి సమష్టిగా పాటుపడదామన్నారు. తాను అందరికీ అండగా ఉంటానని వివరించారు.

అభివృద్ధిలోనూ పరుగులు...

లిడ్‌క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేవలం సంక్షేమంలోనే కాకుండా అభివృద్ధిలోనూ పరుగులు తీయించిన సమర్థవంతమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు పాలన అంతా మోసాల మయమని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, బండి నాగేంద్ర పుణ్యశీల, లాజర్, కార్పొరేటర్ శీరంశెట్టి పూర్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు పోతిన మహేష్, కేశినేని శ్వేత, కాలే పుల్లారావు, దాసరి సువర్ణరాజు, దాసీ జయప్రకాష్ కెనడీ, తోకల శ్యామ్, గడ్డం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుకు గురై యువకుడి మృతి

కంకిపాడు: పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. కోలవెన్ను గ్రామానికి చెందిన ముగడ గంగులు కుటుంబం జీవిస్తోంది. వ్యవసాయ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గంగులుకు కుమారుడు, కుమార్తె సంతానం కలరు. కుమారుడు లోకేష్ (17) ఉయ్యూరులోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ విద్యనభ్యసించాడు. సెలవులు కావటంతో ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ నెల 4న గంగులు తన భార్యతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో లోకేష్ తన తండ్రికి ఫోన్ చేసి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని పాము కాటు వేసిందని చెప్పాడు. వెంటనే గంగులు ఇంటికి వచ్చి లోకేష్‌ను వైద్యం నిమిత్తం కంకిపాడు సీహెచ్‌సీకి తీసుకొచ్చాడు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం లోకేష్ మృతి చెందాడు.

తెలంగాణ మద్యం స్వాధీనం

తిరువూరు: మండలంలోని వావిలాల శివారు వెంకటేశ్వర నగర్‌లోని ఓ ప్రైవేట్ గోదాములో నిల్వ చేసిన తెలంగాణ మద్యం సీసాలను తిరువూరు పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..గోపాలరావుకు చెందిన గోదామును తనిఖీ చేసి 2,304 తెలంగాణ మద్యం సీసాలను గుర్తించారు.

నగరాల సామాజిక వర్గానికి సముచిత స్థానం



హాజరైన నగరాల సామాజిక వర్గ ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న షేక్. ఆసిఫ్

వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ):నగరాలకు సామాజికంగా, రాజకీయంగా సముచిత స్థానం కల్పించింది సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ తెలిపారు. పిళ్లా రవి ఆధ్వర్యంలో ఆదివారం సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో నగరాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా షేక్. ఆసిఫ్, వైఎస్సార్ సీపీ నాయకులు పోతిన మహేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ దుర్గగుడి చైర్మన్‌గా, నగర మేయర్‌గానే కాకుండా నగరాల కార్పొరేషన్‌లో నగరానికి చెందిన పలువురికి డైరెక్టర్లుగా అవకాశం కల్పించారన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జగనన్నకు తోడుగా ఉండటంతో పాటు ఎంపీగా కేశినేని నానికి, అసెంబ్లీకి తనకు నగరాలు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. రాబోయే రోజుల్లో నగరాల సామాజిక వర్గానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. పోతిన మహేష్ వైఎస్సార్ సీపీలోకి రావడం మరింత బలాన్ని చేకూరిందన్నారు. నమ్ముకున్న నాయకులకు పదవులు ఇచ్చి ఉన్నత స్థానంలో కూర్చోబెట్టే మంచితనం జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. అయితే, నమ్ముకున్న వారిని నట్టేట ముంచేది పవన్ కళ్యాణ్‌దని పోతిన మహేష్ ధ్వజమెత్తారు. పవన్ కళ్యాణ్‌ను నమ్ముకున్న అభిమానులు, కార్యకర్తలను మోసం చేసి పశ్చిమ సీటును మాయ కూటమిలో కలిపేసి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్యాకేజీకి అమ్ముడు పోయిన పవన్ కళ్యాణ్, తెలుగుదేశం, బీజేపీలకు జనసేన సీటును ఇచ్చేశారన్నారు. మంచి చేసిన సీఎం జగన్‌కు మద్దతు ఇవ్వకుండా మోసం చేసిన సుజనా వెనుక మనీ కోసం సామాజిక వర్గ ముసుగు వేసుకుని తిరుగుతున్న నాయకులకు తగిన రీతిలో బుద్ధి వచ్చేలా ప్రతి కార్యకర్త సీఎం జగన్ కోసం పని చేయాలన్నారు. ఐదేళ్లకు ఒక సారి నగరాల సామాజిక వర్గాన్ని మోసం చేయడం, డబ్బులు సంపాదించుకోవడం పరిపాటయిందన్నారు. కొంత మంది వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం నగరాల భవిష్యత్తును, రానున్న తరాల రాజకీయ అవకాశాలను సమాధి కడుతున్నారన్నారు. చిట్టినగర్‌లోని దేవస్థాన కమిటీ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని, ఒక్కరోజుతోనే మార్పు వస్తుందని భావించడం లేదని, నేడు మార్పు మొదలైందన్నారు. కార్యక్రమంలో కొరగంజి వెంకట రమణ, పోతిన సాంబ, తమ్మిన రఘు, తొత్తడి భరత్, పోతిన రమేష్, అడ్డూరి తమ్మారావు, పిళ్లా వంశీ, పిళ్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



నృత్య ప్రదర్శన చేసిన కళాకారులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు పలువురు నృత్యకారులు నృత్య నీరాజనాలను అర్పించారు. ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మసన్నిధిలో గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కళ్యాణి డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు నృత్య ప్రదర్శన ఇచ్చారు. సాయంత్రం అమ్మవారికి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చారు. చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు కళావేదిక వద్దకు విచ్చేశారు. నృత్య ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించడమే కాకుండా చిన్నారులతో కలిసి సెల్ఫీలు, ఫొటోలు దిగారు. అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందించారు.

విశ్వబ్రాహ్మణులను గుర్తించింది జగనన్న ప్రభుత్వమే

ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీకాంత్



నాని, ఆసిఫ్‌లను గెలిపించాలని కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్ తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ):రాష్ట్రంలో విశ్వబ్రాహ్మణ సామాజికవర్గాన్ని గుర్తించింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. మే 13న జరిగే సాధారణ ఎన్నికల పోలింగ్‌లో విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని), పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరుతూ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లలోని విశ్వ బ్రాహ్మణులను కలుస్తున్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటే విశ్వబ్రాహ్మణ సామాజకవర్గం ప్రజలు మరింత అభివృద్ధి చెందుతారని వారికి వివరిస్తున్నారు. విజయవాడ పార్లమెంట్ సభ్యుడిగా పదేళ్లపాటు ఏడు నియోజకవర్గాల ప్రజలకు ఎంతో మేలు చేసి వారి మన్ననలను పొందిన కేశినేని శ్రీనివాస్ (నాని)ని, అలాగే పశ్చిమ నియోజకవర్గంలో అందరికీ చిరపరిచితుడైన స్థానికుడైన షేక్ ఆసిఫ్ విజయానికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమ నియోజకవర్గం ఏర్పాటైన 1967 నుంచి పశ్చిమంలో స్థానికులే ఎమ్మెల్యేలుగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ రోజు డబ్బు సంచులతో విమానంలో ఇక్కడికి వచ్చిన బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి నియోజకవర్గ భౌగోళిక స్వరూపమే తెలియకుండా ఏదేదో మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

విశ్వబ్రాహ్మణులకు సీఎం జగనన్న ప్రభుత్వం ఏం చేసిందంటే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి విశ్వబ్రాహ్మణ సామాజికవర్గానికి చేసిన మేలు గురించి ఆ కులానికి చెందిన కుటుంబాలకు తోలేటి శ్రీకాంత్ వివరించారు. బస్టాండ్ ఎదురుగా ఉండే విశ్వబ్రాహ్మణ అపరకర్మల భవనాన్ని టీడీపీ ప్రభుత్వం కూల్చివేస్తే, సీఎం జగనన్న విజయవాడ నడిబొడ్డున స్థలం ఇవ్వడమే కాకుండా భవన నిర్మాణానికి సహకరిస్తుందని వారికి చెప్పారు. అదే విధంగా వైఎస్సార్ కడప జిల్లాలోని బ్రహ్మంగారి మఠానికి నేరుగా విజయవాడ నుంచి బస్సు కల్పించారని తెలిపారు. కులవృత్తిలో భాగంగా వడ్రంగి పనులు చేసుకునే కార్పెంటర్‌లకు తరచుగా చేతి వేళ్లకు జరిగే ప్రమాదాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో పది రకాల వైద్య చికిత్సలను పొందుపరిచారని పేర్కొన్నారు. శ్రీవిరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుండటం మన జాతికి గర్వకారణమని వివరించారు. ఇలా అనేక రకాలుగా విశ్వబ్రాహ్మణ జాతి గౌరవాన్ని ఇనుమడింప చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే మనమంతా గౌరవంగా తలెత్తి తిరిగే అవకాశం ఉంటుందని, ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో అలుగోజు ఆచారి, సున్నపు వీరభద్రాచారి, ధనాలకోట శేఖర్‌బాబు, వానపల్లి వెంకట్రావు, పందూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

• సజావుగా పోస్టల్ బ్యాలెట్



విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ సజావుగా సాగుతోంది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పెద్ద సంఖ్యలో కేంద్రానికి తరలివచ్చి ఓటు వేశారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు సైతం తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే అవకాశం పొందారు. కలెక్టర్ ఢిల్లీ రావు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



